

నాంచారిమడూర్‌లో మాట్లాడుతున్న మంత్రి దయాకర్‌రావు

### బీఆర్‌ఎస్ పాలనలో

**కరువు నేలను కోనసీమగా మార్చిన సీఎం కేసీఆర్**

# పండుగలా వ్యవసాయం

- వందల కోట్లతో పాలకుర్తి నియోజకవర్గం అభివృద్ధి
- డబ్బుతో గెలుస్తామనే అహంకారంలో కాంగ్రెస్
- ప్రజల కష్ట సుఖాల్లో తోడు నడిచిన నన్ను ఆశీర్వదించాలి
- బీఆర్‌ఎస్ పాలకుర్తి అభ్యర్థి, మంత్రి ఎర్రబెల్లి

తొర్రూరు, నవంబర్ 18 : కరువుతో నెర్రెలు బారిన నేలను సస్యశ్యామలం చేసి బీడు భూములకు సాగునీరందించిన ఈ ప్రాంతాన్ని కోనసీమలా మార్చిన సీఎం కేసీఆర్ వ్యవసాయాన్ని పండుగలా చేశారని బీఆర్‌ఎస్ పాలకుర్తి నియోజకవర్గ అభ్యర్థి, మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ముఖ్యమంత్రి ఆశీస్సులతో వందల కోట్ల నిధులతో గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించిన నన్ను పాలకుర్తి నియోజకవర్గ ప్రజలు మరోసారి ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం తొర్రూరు మండలం గుడిబండ తండా, నాంచారిమడూర్, పెద్దమంగ్యాతండా, టీక్యాతండా, వెంకటాపురం, అమర్‌సింగ్‌తండా, దుబ్బతండా, హరిపిరాల, కర్కాల గ్రామాల్లో ఆయన ప్రజలనుద్దేశించి మాట్లాడారు. ఒకప్పుడు కరువుతో అల్లాడే ఈ ప్రాంతం నేడు జలకళతో పచ్చటి పైర్లతో కళకళలాడుతోందని, దీనికి సీఎం కేసీఆర్ కారణం కాదా ఆలోచించాలన్నారు. కాళేశ్వరం, దేవాదుల ద్వారా వచ్చే నీటితో పాలకుర్తి నియోజకవర్గంలో లక్షా 15 వేల ఎకరాల్లో పంటలు పండుతున్నాయని, వేసవిలో కూడా చెరువులు నిండి మత్తళ్లు పోస్తున్నాయని తెలిపారు. వ్యవసాయానికి నిరంతర ఉచిత విద్యుత్, రైతుబంధు, రైతు బీమా పథకాలు అమలు చేయడంతోపాటు రైతు పండించిన ధాన్యాన్ని, మక్కలను రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేస్తున్నదని ఎర్రబెల్లి తెలిపారు. ఒక మోటర్‌కు ఏటా కనీసం లక్ష రూపాయల విద్యుత్ బిల్లు వస్తుందని, ఇదంతా ప్రభుత్వానికి భారమైనా రైతులకు న్యాయం చేయాలని సీఎం కేసీఆర్ వ్యవసాయానికి, పరిశ్రమలకు, గృహ అవసరాలకు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేస్తున్నారని చెప్పారు. కాంగ్రెస్ నాయకుల మాయమాటలను ప్రజలు నమ్మొద్దని, ఆ పార్టీ అధికారంలోకి వస్తే వ్యవసాయానికి మూడు గంటల విద్యుత్‌కు మించి రాదన్నారు. నియోజకవర్గంలో కోట్ల రూపాయలు వెచ్చించి ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సేవలందిస్తున్నామని వివరించారు. ఈ ప్రాంతానికి ఎంతో చేశానని చెప్పుకుంటున్న కాంగ్రెస్ నేతలు కరోనా కాలంలో ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. యువతకు, అవసరార్థుల కోసం కోట్లు వెచ్చించి డ్రైవింగ్ లైసెన్స్‌లు, ఉపాధి కూలీలకు కిట్లు అందజేశామన్నారు. మహిళలకు స్వయం ఉపాధి కల్పించాలని ఊరూరా కుట్టు శిక్షణ ఇప్పించి ఉచితంగా మిషన్లు అందజేయడమే కాకుండా వరంగల్ టెక్స్‌టైల్ పార్క్‌లో ప్రతిభ ఆధారంగా రూ.15 వేల వరకు నెలసరి ఆదాయం సమకూర్చుకునేలా వందలాది ఉద్యోగాలు కల్పించబోతున్నామని ఆయన తెలిపారు. గ్రామాల్లో కోతుల బాధ లేకుండా కార్యాచరణ చేపట్టామన్నారు. కష్టకాలంలో మీ వెంట ఉన్న దయన్నను కాపాడతారా.. లేదంటే అమెరికా నుంచి సూట్ కేసుల్లో డబ్బులు తెచ్చి ఓట్లు కొనాలని చూస్తున్న కాంగ్రెస్ వాళ్లని కాపాడతారా..? మీరే ఆలోచించుకోవాలని ప్రజలను కోరారు. ఆరోగ్యశ్రీ ట్రస్ట్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్‌రావు మాట్లాడుతూ.. పాలకుర్తి నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేసి ఊరూరికి సాగునీరు, ఇంటింటికీ తాగునీరు అందించేలా కృషి చేసిన ఎర్రబెల్లి దయాకర్‌రావును భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు తొర్రూరు పట్టణానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు మద్దతు తెలిపారు. శనివారం స్థానిక బీఆర్‌ఎస్ కార్యాలయంలో దయాకర్‌రావును కలిసి ఈ ఎన్నికల్లో తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తూర్పాటి చిన్న అంజయ్య, జడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.



మహబూబాబాద్ మున్సిపాలిటీలో మాట్లాడుతున్న మంత్రి సత్యవతి, చిత్రంలో ఎమ్మెల్యే శంకర్‌నాయక్

# గ్యారెంటీలను నమ్మొద్దు

- కాంగ్రెస్ అధికారంలో ఉన్న కర్ణాటకలో ఎందుకు అమలు చేస్తలేరు?
- ఆ పార్టీని నమ్మితే నట్టేట మునుగుతం..
- కాంగ్రెస్ పాలనలో జనం గోస పడ్డరు..
- బీఆర్‌ఎస్ పాలనలో ఇంటింటికీ సంక్షేమం
- ఎన్నికల ప్రచారంలో మంత్రి సత్యవతిరాథోడ్

మహబూబాబాద్, నవంబర్ 18 : సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న కల్యాణలక్ష్మి, రైతుబంధు, 24 గంటల ఉచిత కరెంటు వంటి పథకాలను కాంగ్రెస్, బీజేపీ ఎప్పుడైనా, ఎక్కడైనా అమలు చేశాయా..? అని రాష్ట్ర మంత్రి, మహబూబాబాద్ జిల్లా ఎన్నికల ఇన్‌చార్జి సత్యవతిరాథోడ్ ధ్వజమెత్తారు. శనివారం ఆమె బీఆర్‌ఎస్ మహబూబాబాద్ అభ్యర్థి, ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్‌తో కలిసి పట్టణంలోని 27, 33వ వార్డుల్లో గడపగడపకూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని సంక్షేమ పథకాలను తెలంగాణలో సీఎం కేసీఆర్ అమలు చేస్తున్నారని, ఇలాంటి పథకాలను కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అమలు చేశారా..? మండిపడ్డారు. ఆసరా పింఛన్లు, కేసీఆర్ కిట్, రైతుబీమా వంటి పథకాలు తెలంగాణ రాష్ట్రంలో తప్పా దేశంలో మరెక్కడా అమలు కావడం లేదన్నారు. 2014కు ముందు మానుకోట ఎలా ఉంది..?, ఇప్పుడెలా ఉందో ప్రజలు ఆలోచించాలన్నారు. సీఎం కేసీఆర్ పాలనలో మానుకోటను జిల్లా చేసుకున్నామని అభివృద్ధిలో ముందుంచామన్నారు. అభివృద్ధి చేసే నాయకులను ఎన్నుకుంటారో..?, ఆరు గ్యారెంటీలంటూ మాయమాటలు చెప్పే నాయకులను ఎన్నుకుంటారో.. ప్రజలే తేల్చుకోవాలన్నారు. మానుకోట ప్రజలంటే దేశం మొత్తం తెలుసని, అలాంటి వారు విచక్షణ లేని నాయకులను ఓటు వేయరని అన్నారు. ఒక్క చాన్స్ అంటూ ముందుకు వచ్చే నాయకులు.., 11 సార్లు అధికారంలో ఉన్నప్పుడు ఏం చేశారో ప్రజలకు జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పాలనలో సర్కారు దవాఖానలు అధ్వానంగా ఉండేవని, ప్రజలు వెళ్లేందుకు భయపడేవారని అన్నారు. నేడు బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రభుత్వ వైద్యశాలలను సకల సౌకర్యాలతో తీర్చిదిద్దడంతో ప్రజలు క్యూ కడుతున్నారని అన్నారు. మానుకోటలో వంద పడకల వైద్యశాలను 365కి పెంచామని, గత జనవరిలో మానుకోటకు వచ్చిన సీఎం కేసీఆర్ మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.50కోట్ల నిధులు కేటాయించారని తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులు పూర్తయితే మానుకోట రూపురేఖలు మారుతాయన్నారు. సీఎం కేసీఆర్ దిశానిర్దేశంలో శంకర్‌నాయక్ పని చేస్తున్నారని, అభివృద్ధి చేసే నాయకులను ప్రజలు ఎన్నుకోవాలని సూచించారు. బీజేపీ, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు ఏ నిర్ణయం తీసుకోవాలన్నా ఢిల్లీ వెళ్లాల్సిందేనని గుర్తు చేశారు. మానుకోట అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తూ 24 గంటలు నియోజకవర్గంలో అందుబాటులో ఉండే శంకర్‌నాయక్‌ని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. వ్యవసాయంపై అవగాహన లేని రేవంత్‌రెడ్డి రైతులకు 3గంటల కరెంట్ చాలంటూ అహంకారంగా మాట్లాడాడని, ఓటుతో అతడికి గుణపాఠం చెప్పాలన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటేస్తే రైతుబంధు, రైతు బీమా, 24 గంటల ఉచిత కరంట్ రాదన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్ రెడ్డి, వైస్ చైర్మన్ ఎండీ ఫరీద్, నాయకులు పాల్గొన్నారు.

# ఓటు అడిగే హక్కు బీఆర్‌ఎస్‌కే ఉంది

- కాంగ్రెస్ మాటలు నమ్మి మోసపోవద్దు
- ఒక్కఓటు పోకుండా మీ ఆడబిడ్డ గౌరవాన్ని నిలబెట్టాలి
- రెడ్యానాయక్‌కు భారీ మెజార్టీ అందించాలి
- మంత్రి సత్యవతిరాథోడ్
- సమైక్యపాలనలో కష్టాలు మరిపోవద్దు
- డోర్నకల్ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్

కురవి, నవంబర్ 18 : తెలంగాణ రాష్ట్రంలో ఓటు అడిగే హక్కు ఒక్క బీఆర్‌ఎస్‌కే ఉందని, రాష్ట్ర గిరిజన, స్త్రీ శిశు సంక్షేమ శాఖల మంత్రి సత్యవతిరాథోడ్ అన్నారు. శనివారం ఆమె డోర్నకల్ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్, మాజీ ఎంపీ సీతారాంనాయక్‌తో కలిసి తట్టుపల్లి, చంద్యాతండా, చీమ్లతండా, మోద్గులగూడెం, జుజ్జూరుతండా, బేగావత్‌తండా, గుండ్రాతిమడుగు(విలేజ్), పెద్దతండా, లింగ్యాతండా(కె), తుల్స్యాతండా, కురవి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... గుండ్రాతిమడుగు, పెద్దతండా తాను పుట్టిన ఊరని, తన రాజకీయ జీవితం ఇక్కడ సర్పంచ్ అయిన తర్వాతనే ప్రారంభమైందన్నారు. సీఎం కేసీఆర్ నన్ను ఎమ్మెల్సీగా, మంత్రిగా చేసి రాజకీయ జన్మనిచ్చిన మహనీయుడన్నారు. మీ ఆడబిడ్డగా కోరుకుంటున్నా.. నా గౌరవం నిలబడేలా ప్రతి ఒక్కరూ డోర్నకల్ ఎమ్మెల్యే రెడ్యానాయక్ కారుగుర్తుకు ఓటు వేసి నియోజకవర్గంలోనే అన్ని గ్రామాలకంటే అత్యధిక మెజార్టీ ఇవ్వాలని కోరారు. రైతుబంధు, రైతు బీమా, 24 గంటల కరెంటుతో రైతాంగం కోలుకుంటుంటే, వ్యవసాయం మీద అవగాహన లేని నాయకులు 3 గంటల కరెంటు చాలంటూ రైతులను అవమానపరుస్తున్నారని అన్నారు. ప్రతి ఆడబిడ్డ సగర్వంగా నిలబడాలనే సీఎం కేసీఆర్ పేదల సంక్షేమానికి వేలాది కోట్లు కేటాయించారన్నారు. కల్యాణలక్ష్మి పథకం ద్వారా పేదింటి ఆడబిడ్డలకు వరంలా మారిందన్నారు.కేసీఆర్ కిట్‌తో ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాల సంఖ్య పెరిగిందని, తద్వారా పేదింటికి రూ.30వేల ప్రసూతి ఖర్చులు మిగులుతున్నాయన్నారు. గిరిజనులు సీఎం కేసీఆర్‌ను గుండెల్లో పెట్టుకోవాలన్నారు. సీఎం కేసీఆర్ లేకుండా మన తండాలు మారేవా.. గుండెమీద చేయివేసుకుని ఆలోచించాలన్నారు. మన పిల్లల భవిష్యత్ కోసం రిజర్వేషన్లు పెంచిన గొప్ప మహనీయుడన్నారు. ఉన్నత విద్యలో కూడా రిజర్వేషన్ కల్పించిన మరువొద్దన్నారు. జిల్లాకో వైద్యశాల, ప్రభుత్వ వైద్యారంగాన్ని పటిష్టం చేశారని అన్నారు. ఎన్నికలు రాంగనే బయలుదేరే పగటివేషగాళ్ల మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. అధికారంలో ఉన్నప్పుడు చేయలేనోళ్లు ఇప్పుడుచేస్తారా.. ఆలోచించాలన్నారు. ఒకరు కరెంటు దండ గ అంటరు.., మరొకరు రైతుబంధు ఇవ్వొద్దు అంటరు.. అసలు వీరికి వ్యవసాయం మీద అవగాహన ఉందా అని ప్రశ్నించారు. మీ సంక్షేమం నిలువాలన్నా, రాష్ట్రం మరింత అభివృద్ధి కావాలన్నా.. కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. డోర్నకల్ ఎమ్మెల్యే రెడ్యానాయక్ మాట్లాడుతూ.. విద్య, వైద్య రంగాలను అభివృద్ధి చేసిన నాయకుడు సీఎం కేసీఆర్ అనే విషయాన్ని ప్రజలు మరిచిపోవద్దన్నారు. ఎందరో ప్రాణత్యాగాలతో ఏర్పడిన రాష్ట్రాన్ని మళ్లీ తాకట్టు పెడుతామా.. ప్రజలు ఆలోచించాలన్నారు. నేను మీ వాడినని.. మీ కష్ట సుఖాల్లో తోడుంటున్నానని, మరోసారి ఆశీర్వదించాలని కోరారు. మీ దయతో మళ్లీ గెలిచి మిగిలిన పనులన్నింటినీ పూర్తి చేసి, నియోజకవర్గ చరిత్రలో రెడ్యానాయక్ పేరు స్థిరస్థాయిగా ఉండేలా చూసుకుంటానన్నారు. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే మళ్లీ కష్టాలు తప్పవన్నారు. ఈ కార్యక్రమాలలో జడ్పీటీసీ బండి వెంకట్ రెడ్డి, మండల అధ్యక్షుడు తోట లాలయ్య, జిల్లా నాయకులు బజ్జూరి పిచ్చిరెడ్డి, శ్రీరాంనాయక్, ఆర్‌బీఎస్ మండల కోఆర్డినేటర్ ముండ్ల రమేశ్, ఓడీసీఎంఎస్ మాజీ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, గార్లపాటి వెంకట్ రెడ్డి, గుగులోత్ రవి, మాజీ ఆలయ చైర్మన్లు రాజూనాయక్, రామూనాయక్, సోమిశెట్టి శ్రీనివాస్, నూతక్కి నర్సింహారావు, ఎంపీటీసీ భాస్కర్, కోఆప్షన్ సభ్యురాలు యాకూబీ, గుగులోత్ పద్మ, నెహ్రూనాయక్, మంగీలాల్, చింగ్యానాయక్, మల్సూర్, రమేశ్, పోతుగంటి వెంకన్న, మట్టసైదులు, రాంరెడ్డి, రాములు, నరహరి, దేవేందర్, రాము, వెంకటమల్లు, కవిత అజయ్, అశోక్, శివరామ్, కొణతం విజయ్, సంగెం భరత్, రవి, వీరన్న, లక్ష్మణ్, కిషన్‌నాయక్, శ్రీను, రజిత, బాలు, తుల్స్యావీరన్న, తుకారాం, నాగిరెడ్డి, దైద భద్రయ్య, కిన్నెర మల్లయ్య, రవి, ప్రసాద్, వెంకన్న, రపెల్లా తదితరులు పాల్గొన్నారు.



కురవి: ప్రచారంలో పాల్గొన్న మంత్రి సత్యవతి, ఎంపీ కవిత, ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే రెడ్యానాయక్

### రెడ్యానాయక్ అంటే నమ్మకం

**: ఎంపీ మాలోత్ కవిత**

రెడ్యానాయక్ అంటేనే నమ్మకమని, నిజాయితీకి నిలువెత్తు నిదర్శనమని ఎంపీ, జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షురాలు మాలోత్ కవిత అన్నారు. కురవి మండలంలో ఆమె మాట్లాడుతూ.. కొత్త బిచ్చగాడు పొద్దెరగడు అన్నట్లు కాంగ్రెసోళ్ల పరిస్థితి తయారైందన్నారు. మీకు రెడ్యానాయక్ ఇల్లు తెలుసు...కానీ ఊరు తెలివని వ్యక్తికి ఓటు వేస్తే మోసపోతామన్నారు. రెడ్యానాయక్ ఆస్తి మీరేనని, ఆయనను ఓడగొట్టే మొనగాడు రాడన్నారు.